## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరం



పేదలకు వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు లయన్స్ క్లబ్ విజన్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ప్రముఖ వైద్యులు వీఎం నగేష్ బృందంచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ప్రతినిధి బి.మురళీ మోహనరావు ప్రారంభించారు. 104 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా రెండో శనివారం రామకోటి ప్రాంగణంలో ఏర్పాటుచేస్తామని, ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు మల్లవల్లి చలపతిరావు, కార్యదర్శి కంది బాలకృష్ణ తదితరులు కోరారు.

### 115 మందికి వైద్య పరీక్షలు



మహిళకు పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్) : సమాజ సేవలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు శ్రీకృష్ణ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. ఆర్ఆర్‌పేటలోని ఆస్పత్రి ఆవరణలో శనివారం నిర్వహించిన శిబిరంలో 115 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, బీఎండీ (ఎముకల సాంద్రత), స్కానింగ్, ఎక్స్ రే పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్టు డాక్టర్ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది, టెక్నికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

### జీజీహెచ్‌కు వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థ ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సున్న మురళీకృష్ణ జీజీహెచ్‌కు వీల్ చైర్‌ను అందజేశారు. డీఎస్పీ తన అత్తగారైన జిజ్జువరపు రత్నమణి జయంతిని పురస్కరించుకుని వీల్‌చైర్‌ను హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావుకు అందజేశారు.

# అడుగంటిన చెరువులు

- ఆందోళనలో చొదిమెళ్ల రైతులు
- వృథాగా పోతున్న తమ్మిలేరు నీరు
- స్పందించని అధికారులు

ఏలూరు రూరల్ : చొదిమెళ్ల గ్రామం పక్క నుంచే ప్రవహిస్తున్న తమ్మిలేరులోని వేలాది క్యూసెక్కుల వరదనీరు వృథాగా పోతోంది. మరోవైపు కూతవేటు దూరంలో విశాలమైన దొండపాడు, రాయుడు సాగునీటి చెరువులు ఎండిపోయాయి. ఈ పరిస్థితులు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. కళ్ల ముందే పారుతున్న వరదనీరు పంటచేలకు చేరడం లేదని వారు వాపోతున్నారు. దొండపాడు, రాయుడు చెరువులకు వరదనీరు మళ్లించాలన్న ఆలోచన ఇరిగేషన్ అధికారులు, పాలకులకు కలగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆక్రమణల్లో పంట కాలువ**

సుమారు 100 ఏళ్ల క్రితం తవ్విన దొండపాడు, రాయుడు చెరువులకు వరద, వర్షపు నీరు మళ్లించేలా నాటి పాలకులు స్లూయిజ్, కల్వర్టులు, పంట కాలువ తవ్వించారు. కొంతకాలంగా చెరువులకు చుట్టుపక్కల వెలస్తున్న లేఅవుట్ల కారణంగా పంట కాలువ ఆక్రమణకు గురై కుచించుకుపోయాయి. మురుగునీరు పారే బోదెలు సైతం కనుమరుగయ్యాయి. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు నిండడం లేదు. వేసవికాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మురుగునీరు కిందకు పారక చేలు మునిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కూలీలతో పూడిక పనులు చేపట్టారు. చొదిమెళ్ల ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైనందున ఇప్పుడు ఆ పనులు చేపట్టడం లేదు. మరోపక్క ఇరిగేషన్ అధికారులు చెరువులు నింపే పనులు గాలికి వదిలేశారు. ఫలితంగా వందలాది ఎకరాల సాగు భూములకు నీరు అందడం లేదు. ఇప్పటికే చొదిమెళ్ల రైతులు వర్షపునీటితో చెరువు కింద వందలాది ఎకరాల్లో నాట్లు వేశారు. మరో రెండు నెలల పాటు సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంటుంది. పలువురు రైతులు భూస్వాముల నుంచి బోరు నీరు కొనుక్కొని పంటను కాపాడుకుంటున్నారు. డబ్బు లేని పేద రైతులు లబోదిబో అంటారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు యడ్లపల్లి శివ, యడ్లపల్లి మహేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, వాడవల్లి రంగారావు తదితరులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.



నీరు లేక వెలవెలబోతున్న దొండపాడు చెరువు

**చొదిమెళ్లలో సిరుల సాగు**

పూర్వీకులు కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న చొదిమెళ్ల రైతులు సిరులు పండిస్తున్నారు. సుమారు 50 ఎకరాలు విస్తీర్ణం గల దొండపాడు చెరువు ఖరీఫ్ సమయంలో నీటితో కళకళలాడేది. ఈ నీటిని ఉపయోగించుకుని రైతులు దీనికి దిగువన ఉన్న సుమారు 200 ఎకరాల్లో వరి పండించేవారు. ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు దిగుబడి సాధించేవారు. వేసవికాలంలో ఈ చెరువులో కూరగాయలు, ఆకు కూరలతో పాటు ఆరుతడి పంటలు, మొక్కజొన్న పండించి లాభాలు గడించారు. ఇదే క్రమంలో సుమారు 40 ఎకారల విస్తీర్ణం రాయుడు చెరువులోకి సైతం వరదనీరు పారేది. ఈ చెరువు నీరు సద్వినియోగం చేసుకుని సుమారు 200 ఎకరాల్లో రైతులు సిరులు పండించేవారు.





మురుగునీరు కిందకు పారక గత ఏడాది వర్షాలకు నీట మునిగిన పంట చేలు (ఫైల్), పడమట లాకుల నుంచి వృథాగా పోతున్న తమ్మిలేరు వరదనీరు

# భాషా లేఖన అభ్యాసం చేయించాలి



బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినడం, చదవడం, రాయడం, మాట్లాడటం ఈ నాలుగింటినీ భాషా కౌశలాలంటారని, నేడు విద్యార్థులు భాషను రాయడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందుకే ప్రతిరోజు భాషా లేఖన అభ్యాసం చేయించాల్సిన అవసరం ఉందని స్థానిక హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకట స్వామి అన్నారు. స్థానిక పవరుపేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి ఆధ్వర్యంలో శనివారం 5, 6, 7 తరగతుల విద్యార్థులకు హిందీ భాషా లేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 61 మంది పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా కె.భువన, సీహెచ్ తాన్య, ఎండీ ఆర్వాజ్ ఖాన్ పొందగా బి.నిశాల్ వర్మ, పి.పూజిత ప్రోత్సాహక బహుమతులు పొందారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందీ భాషా నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రముఖ హిందీ కవి తులసీదాస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హిందీ పండిత శిక్షణ కళాశాల లెక్చరర్ పీఎం మోహన్ కుమార్ తులసీదాసు గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో హిందీ పండితులు విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం, 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఆదివారం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు చిత్రలేఖన పోటీలు, మూడు గంటలకు బిట్ క్వశ్చన్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రామకోటి కళావేదికపై స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణ పోటీలు, నృత్య ప్రదర్శనలు, సందేశాత్మక పాటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు రామకోటి కళావేదికపై సభా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 32 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 30-80 |
| వంకాయలు (కాంతులు) | 40 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | -- | ములక్కాదలు | 7,10 |
| బెండకాయలు | 24 | కంద | 50 |
| పచ్చిమిర్చి | 46-48 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 40 | కీరా దోస | 50 |
| బీరకాయలు | 24 | ఫ్రెంచ్‌బీన్స్ | 70 |
| బీరకాయలు (పందిరి) | 36 | అల్లం | 100-160 |
| క్యాబేజీ | 26-28 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 38-56 | పాలకూర | 10 |
| దొండకాయలు | 38 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 40 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 40 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 32 | పుదీనా | 05 |
| దోసకాయలు | 20-28 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 15-20 | క్యాప్సికమ్ | 80 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకదదుంప | 48 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 12 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 10 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 02 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 26 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 07 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 11 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 05 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 02 |
| ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 07 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 12 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 06 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 26 |

### జాతీయ సమితి సమ్మేళనాల పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు వైజాగ్‌లో ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. స్థానిక కోటదిబ్బ ఎస్సార్ వన్ వద్ద జాతీయ సమితి సమ్మేళనాల వాల్ పోస్టర్‌ను ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆవిష్కరించారు. జాతీయ సమితి సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఉద్యోగ, కార్మికులను అప్పలరాజు కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ హరినాథబాబు, బి.దుర్గారావు, ఎస్ఎంవీ సుబ్బారావు, డి.వెంకటేష్, ఎం సయ్యద్ బాజీ, సీహెచ్ విజయ్, ఎస్ గౌరీ శంకర్, కె.వెంకటేశ్వరరావు, ఎం ఆదినారాయణ, ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల హక్కులను కాపాడడమే లక్ష్యం



యూటీఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకు చారిత్రాత్మక అవసరంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించిందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో యూటీఎఫ్ 51వ ఆవిర్భా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ఉపాధ్యాయులకు పాటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ నెల వరకు వివిధ కార్యక్రమాలు, మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ముస్తఫా ఆలీ మాట్లాడుతూ పూర్వపు నాయకత్వం చేసిన త్యాగాలను గుర్తుచేశారు. రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి మాట్లాడారు. తొలుత యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ సతీమణి సుభాని బేగం యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జీవీ రంగమోహన్, నంబూరి రాంబాబు, ఎస్ సుధారాణి, కె.కమల్ కుమార్, బి.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జేపీ కాలనీలో దుర్గంధం

ఏలూరు వన్‌టౌన్‌లోని జేపీ కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం పడితే కాలు బయట పెట్టలేని పరిస్థితి. భవనాల చుట్టూ ఖాళీ స్థలాలు ఉండటంతో వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, విషసర్పాలకు నెలవైంది. సమస్యను కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేదని, ఇటీవల వర్షాలకు దోమలు ఎక్కువై జ్వరాలు, విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయంటూ కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. తమ కాలనీ సమస్యలపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు, పిచ్చిమొక్కలు



ఖాళీ స్థలంలో చేరిన వర్షపు నీరు



కాలనీలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం



దోమలకు అనువుగా నిలిచిన నీరు, తుప్పలు

# ఏలూరులో విస్తృతంగా తనిఖీలు



త్రీటౌన్ పరిధిలో తనిఖీ చేస్తునడీఎస్పీ శ్రావణ్‌కుమార్



టూటౌన్ సీఐ ప్రభాకర్ విజిబుల్ పోలీసింగ్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ స్వయంగా త్రీటౌన్ పరిధిలో శనివారం రాత్రి త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావుతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసుల నమోదుతోపాటు భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపితే ఎదుటి వ్యక్తులకూ ప్రమాదం జరిగే అవకాశం ఉందని అన్నారు. మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వరాదనీ, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు.

- టూటౌన్ ప్రాంతంలో సీఐ ప్రభాకర్ విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ సర్కిల్ పరిధిలో వాహన తనిఖీలు చేశారు. ఏలూరు రూరల్ ప్రాంతంలో ఆశ్రం హాస్పిటల్, చొదిమెళ్ల వద్ద ఎస్సై రాజారెడ్డి వాహన తనిఖీలు చేశారు. టూటౌన్ ఎస్సైలు సాధిక్, మదీనా బాషా, రవితేజ, ఏలూరు త్రీటౌన్ ఎస్సై ఫణీంద్ర, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

### దోమల నివారణ చర్యలు

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 27వ డివిజన్ చొదిమెళ్ల, పెద్ద మాలపల్లి, చిన్న మాలపల్లి, కాపుల బజారు, గౌడ బజారు తదితర ప్రాంతాల్లో నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మాలతి ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యడ్లపల్లి శివ, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

### యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు టౌన్: ప్రేమించమని వెంటబడి ఒక విద్యార్థినిని వేధింపులకు గురిచేస్తోన్న యువకుడిపై ఏలూరులో పోక్సో కేసు నమోదు అయ్యింది. బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన ఒక విద్యార్థిని ఏలూరులో ఇంటర్మీడియట్ విద్య చదువుతోంది. ఆమెను అదే ప్రాంతానికి చెందిన శ్రీరామ్‌నాయక్ అనే యువకుడు ప్రేమించాలంటూ వేధిస్తుండగా, తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 12న బీకేఎంయూ రాష్ట్ర సమితి సమావేశం

ఏలూరు (టూటౌన్) : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర సమితి సమావేశం ఈనెల 12న విజయవాడలో నిర్వహించనున్నట్టు బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

### యాదవ సంఘం ఏలూరు నగర కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): అఖిల భారత యాదవ మహాసభ ఏలూరు నగర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 23 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా పిలగల భాను ప్రకాష్, మేడిబోయిన శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా కొల్లిపర శ్రీనివాస్, కోరాడ బాలకృష్ణ, అధ్యక్షుడిగా మెరుగు మాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా గుమ్మడి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కిలారపు జగదీశ్వరరావు, డొక్కు మల్లేశ్వరరావు, కొమ్మా నాగరాజు, కోశాధికారిగా పుట్టి శ్రీరామ్ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా ఆవాల దుర్గా శ్రీనివాసరావు, బొట్టా అజయ్, పంది ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా తలపంటి శ్రీనివాసరావు, డొక్కు వెంకటరావు, చిలకంటి సాయి, కాట్రు శ్రీనివాసరావు, బోను శ్రీనివాసరావు, కొలుసు కృపానందం, రుద్రబోయిన రాజేష్, కొలుసు సాంబశివరావు ఎంపికయ్యారు. నూతన కమిటీని యాదవ సంఘం నాయకులు కాట్రు బాలు, మల్లిపూడి రాజు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, సూర్యనారాయణలు మాట్లాడుతూ ఏలూరు నగరంలోని యాదవుల ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. యాదవుల్లోని పేద విద్యార్థులకు పూర్తి అండదండలు అందిస్తామని తెలిపారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య, గౌరవ అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు వంటి పెద్దలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొంటామని చెప్పారు.